సాక్షి
నల్లగొండ
శనివారం । 16 । నవంబర్ । 2024



12శాతం రిజర్వేషన్ కల్పించాలి

మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 585.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 35,463 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 35,463 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 16,889 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,654 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 623.38 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: నిల్
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్









కార్తీక కాంతులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు, విద్యుద్దీపాల వెలుగులో ఆలయం

ఛాయా సోమేశ్వరాలయం కోనేరులో దీపాలు వదులుతున్న భక్తులు

ఛాయా సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఛాయా సోమేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా జడ్జి నాగరాజు

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు డెడికేటెడ్ కమిషన్ రాక

నల్లగొండ : రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషా విషయమై ప్రజాభిప్రాయ సేకరణ కోసం డెడికేటెడ్ కమిషన్ శనివారం నల్లగొండ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు 16వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఇతర కుల సంఘాలు, ప్రజలు, సంస్థల నుంచి వ్యక్తిగత అభ్యర్థనలు, సలహాలు, సూచనల సేకరిస్తారని ఆమె తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయా సంఘాలు.. వారి వాదనలకు మద్దతుగా ఉన్న సమాచారం, మెటీరియల్, ఇతర సాక్ష్యాలతో డెడికేషన్ కమిషన్ ఎదుట హాజరై అభిప్రాయాలను చెప్పవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న రాష్ట్ర బీసీ కమిషన్..

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ బృందం ఈ నెల 18న నల్లగొండ రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల వారి సామాజిక, విద్యా పరమైన స్థితిగతులను తెలుసుకునేందుకు బీసీ కమిషన్ వస్తోందని పేర్కొన్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ చేపడుతుందని తెలిపారు. వ్యక్తిగత, నమోదిత, నమోదు కాని అసోసియేషన్ల నుంచి దరఖాస్తులు, సూచనలు, మద్దతుగా ఉన్న సమాచారం మెటీరియల్, వెరిఫికేషన్ అవిడవిట్‌ను బీసీ కమిషన్‌కు అందజేయాలని సూచించారు.

సింగరాజుపల్లి కాల్వల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

డిండి : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలో నూతనంగా నిర్మిస్తున్న సింగరాజుపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించడానికి ఏర్పాటు చేస్తున్న కాల్వ పనులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు(ఎస్ఎల్‌బీసీ యూనిట్-2) శుక్రవారం పరిశీలించారు. కాల్వకు అసరమైన భూ సేకరణలో వీరబోయనపల్లి పరిధిలోని దాదాపు ఆరెకరాలకు నష్ట పరిహారం అందలేదని రైతులు ఇచ్చిన వినతుల మేరకు వివరాలను తెలుసుకున్నారు. ఆయా రైతులకు అసైన్డ్ పట్టా ఉన్నప్పటికీ ఆ భూమి ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని ప్రస్తుతం రైతులకు ఎలాంటి నష్ట పరిహారం చెల్లించలేదని తహసీల్దార్ అంజనేయులు వివరించారు. ఆయన వెంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుభాహానొద్దీన్, బీట్ ఆఫీసర్లు నవీన్, సైదిరెడ్డి, ఆర్ఐ శ్యామ్‌నాయక్ ఉన్నారు.

దేశ ప్రగతిలో ఆదివాసీల పాత్ర కీలకం



బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎఫ్‌సీఐ అధికారులు

నల్లగొండ : దేశ ప్రగతిలో ఆదివాసీల పాత్ర కీలకమని భారత ఆహార సంస్థ నల్లగొండ సీనియర్ అధికారి రఘుపతి అన్నారు. భారత ఆహార సంస్థ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జన జాతీయ గౌరవ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భారత స్వతంత్ర్య సమరంలో బిర్సా ముండా వంటి గిరిజన నాయకుల పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. షెడ్యూల్డ్ తెగల ప్రజానీకం అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు కేఎస్ కే.ప్రసాద్, శ్రీనివాసరావు, శంకర్, కాశిరెడ్డి, వంకుడోతు దిలీప్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ముంపు మాయ!

సాగర్ నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో అక్రమ పట్టాలు

- ఆర్ఓఆర్ ద్వారా మ్యుటేషన్.. పహాణీల్లో నమోదు
- పట్టాలు ఒకరివైతే.. రిజిస్ట్రేషన్లలో మరొకరి ఫొటోలు
- అధికారుల వద్ద అందుబాటులో లేని డాక్యుమెంట్లు
- క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేయాలని ముంపు బాధితుల వేడుకోలు



రాజగట్టు వద్ద సాగులో ఉన్న భూములు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ముంపు బాధితుల కోసం కేటాయించిన భూముల్లో పట్టాదారులను గుర్తించడం అధికారులకు సవాల్‌గా మారింది. అక్కడున్న భూములకు మించి పట్టాలు ఉండడంతో పాటు ప్రభుత్వం వద్ద సరైన డాక్యుమెంట్స్ లేకపోవడంతో ఆక్రమణదారులకు వరంగా మారింది. పట్టాలను అడ్డుపెట్టుకుని కొందరు అటవీ భూములను ఆక్రమిస్తున్నారు. అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయ లోపం కారణంగా కృష్ణపట్టిలోని దామరచర్ల మండలంలో సుమారు వెయ్యి ఎకరాలపై వివాదం నెలకొంది.

సాగర్ నిర్వాసితులకు కేటాయింపు

సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన దేవరకొండ తాలూకా పెద్దగుమ్మడం, చిన్నగుమ్మడం వాసులకు పునరావాసం కింద వజీరాబాద్ బ్లాక్ పరిధిలో అటవీ భూములను కేటాయించారు. రాజగట్టు సమీపంలో సర్వే నంబర్ 826లో సుమారు 1,580 ఎకరాల అటవీ భూమి ఉండగా అందులో 640 ఎకరాలను డిస్ రిజర్వ్‌డ్ (అటవీయేతర) భూమిగా గుర్తించారు. నివాసాలు, ఎస్ఎస్‌పీ కాల్వలకు మినహాయించి ఒక్కో కుటుంబానికి ఐదు ఎకరాలకు మించకుండా 530 ఎకరాల సాగు భూమిని కేటాయించి డిఫాం పట్టాలు అందించారు. అప్పట్లో భూములు సాగుకు యోగ్యంగా లేకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. డిఫాం భూములపై అటవీ, రెవెన్యూ శాఖల వద్ద సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతో కొందరు నకిలీ పట్టాలు సృష్టించి ఆర్ఓఆర్ ద్వారా మ్యుటేషన్ చేయించుకుని పహాణీల్లో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. 2013–24 పహాణీలో 872 ఎకరాలను డిఫాం భూములుగా చూపించారు. అదనంగా 342 ఎకరాలను కాగితాల్లో పేర్కొన్నారంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తెలుస్తుంది.

పేరు ఒకరిది.. ఫొటో మరొకరిది

2005– 06 మధ్యలో సర్వే నంబర్ 826లో జరిగిన రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు జరిగినట్లు ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. డాక్యుమెంట్ నంబర్ 839/06 ద్వారా 55 ఎకరాలు, మరో మూడు దస్తావేజులతో 70 ఎకరాల పట్టా మార్పిడి జరిగింది. డెక్కన్ ఎన్విరాన్‌మెంట్ కంపెనీ నుంచి రత్నాల స్టీల్స్ సంస్థకు సేల్‌డీడ్ జరిగింది. 839 దస్తావేజుల్లో కేతావత్ తార్య పేరుతో 5 ఎకరాల రిజిస్ట్రేషన్ జరగగా రాజగట్టుకు చెందిన కలిమెల దావీదు ఫొటోను అతికించారు. రమావత్ బద్యా 5ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసినట్లుగా ఉంది. దస్తావేజుల్లో నారాయణదాసు రామచంద్రు ఫొటోను ఉంచారు. కాతా లక్ష్మా పేరుతో 5 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరగగా వాడపల్లికి చెందిన చినగుండయ్య ఫొటోను అతికించారు. దీన్ని బట్టి 200 ఎకరాల్లో ఒకరి పేరుతో మరొకరు రిజిస్ట్రేషన్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ముంపు బాధితుల ఆవేదన

ప్రభుత్వ ఒప్పందం ప్రకారం ముంపు బాధిత కుటుంబాలకు ఐదెకరాల భూమితోపాటు పది సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు కొనుగోలు కింద రూ.125కు ఎకరం చొప్పున 2.20 ఎకరాలు ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు నిమిత్తం చలాన్లు కట్టిన 42 మంది కుటుంబాలకు ఇప్పటి వరకు భూములు కేటాయించలేదు. వారు కొన్ని సంవత్సరాలుగా కలెక్టర్, ఆర్డీఓకు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ రిజిస్టర్ ఫైళ్లు దొరకడం లేదని చెప్పడంపై అంతర్యమేంటని ముంపు బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ సర్వే నంబర్లలో ఉన్న ఉడాఫ్ పట్టాలు సైతం అక్రమార్కులు మాయం చేసి తమ పేరు మీద పట్టాలు సృష్టించుకున్నారని ఆరోపిస్తున్నారు. ముంపు బాధితుల ఫైళ్లను అధికారులే మాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

డిఫాం భూములపై అక్రమ పట్టాలు ఉండడంతో పట్టాలపై స్పష్టత రాలేదు. ఈ భూములను పార్ట్ బీలో చేర్చాం. కొంత మందికి పట్టాలు ఇచ్చినా నిషేధిత జాబితాలో ఉంచాం. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.

– జవహర్‌లాల్, తహసీల్దార్, దామరచర్ల

అసలు భూమికి మించి నకిలీ పట్టాలు

సర్వే నంబర్ 430లో వజీరాబాద్ బ్లాక్ దామరచర్ల రెవెన్యూ గ్రామంలో సుమారు 450 ఎకరాల అటవీ భూమిని సాగర్ నిర్వాసితుల కోసం డిస్ రిజర్వ్‌డ్ చేశారు. ఈ భూములపై కొందరు బాధితుల నుంచి నేరుగా డిఫాం పట్టాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించుకోగా కొందరు నేరుగా తమ పేర్లను పహాణీలో నమోదు చేయించుకున్నారు. దీంతో ఇక్కడ భూములకు మించి పట్టాలున్నాయి. ఓ పారిశ్రామికవేత్త తమ కుటుంబసభ్యులు, బంధువుల పేర్లు 150 ఎకరాల భూములకు పట్టాదారులుగా ఉంటూ పహాణీల్లో ఉంది. ప్రస్తుతం ఈ భూములన్నీ గిరిజనులు సాగు చేసుకుంటున్నారు. వీటిపై ఏండ్ల తరబడి వివాదం నడుస్తోంది. పలుమార్లు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించినప్పటికీ ఫలితం లేదు. రెండు సర్వే నంబర్లలో భూములను పార్ట్ బీలో ఉంచారు. సమగ్ర భూ సర్వేలో కొలిక్కి రాకపోవడం, అక్రమ పట్టాలు, నకిలీ డీఫాంలు వెలుగులోకి వస్తుండడంతో ఆ భూములను నిషేధిత జాబితాలో ఉంచారు. నకిలీ పట్టాలతో వీర్లపాలెం, సాత్‌తండా తదితర గ్రామాల్లో అటవీ భూములను ఆక్రమించుకోవడంతో అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి మూడేండ్ల క్రితం హద్దులు గుర్తించారు. వీటిపైన పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

సర్వే వివరాలు బలవంతంగా సేకరించొద్దు

- రాష్ట్ర పరిశీలకుడు రవిచంద్ర



మునుగోడులో సర్వేను పరిశీలిస్తున్న రవిచంద్ర

మునుగోడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాల కోసం ఎన్యుమరేటర్లు ప్రజలను బలవతం చేయవద్దని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారి, సర్వే రాష్ట్ర పరిశీలకుడు జి.రవిచంద్ర సూచించారు. శుక్రవారం మునుగోడు పట్టణంలో చేపట్టిన సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే సిబ్బంది మిమ్మల్ని ఏఏ ప్రశ్నలు అడుగుతున్నారు, మీరు ఆ ప్రశ్నలు సమాధానం ఇస్తున్నారా.. ఈ సర్వే వల్ల మీకు ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్యుమనేటర్లు ప్రజలని ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా సర్వే చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ వి.కోటేశ్వర్‌రావు, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి మురళి ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో ధాన్యం తేవాలి



మంగళపల్లిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ : ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలతో కేంద్రాలకు తేవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. నకిరేకల్ మండలం మంగళపల్లి, గోరెంకలపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. వచ్చిన ధాన్యం నిలవ్వలను, తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు సరైన తేమశాతంతో తాలు, మట్టి పెల్లలు లేకుండా కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే వెంటనే అమ్ముకుని వెళ్లవచ్చన్నారు. 17 శాతం వచ్చిన ధాన్యాన్ని ఆరు గంటల్లో కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి ధ్రువీకరించిన తర్వాతే ఎగుమతి చేయాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీసీఓ పత్యానాయక్, సీసీ స్వరుప తదితరులు ఉన్నారు.

పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్

నల్లగొండ : గ్రూప్– 3 పరీక్షల స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం ఆమె జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్– 3 పరీక్షల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి మాట్లాడారు. పరీక్ష కేంద్రంలో భద్రపరిచిన ప్రశ్నపత్రాలు, ఇతర కాన్ఫిడెన్షియల్ మెటీరియల్‌ను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. భద్రతపై ఆర్‌సీఓలు, చీఫ్ సూపరింటెండెంట్లకు సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాల పెంపు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్




విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ట్రెయినీ కానిస్టేబుళ్ల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో ఓటమిని స్వీకరిస్తూ విజయానికి కావాలిసిన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. 9 నెలల శిక్షణకాలంలో క్రమశిక్షణతో నేర్చుకున్న అన్ని అంశాలు విధి నిర్వహణలో ఉపయోగపడతాయన్నారు. పోలీసు విధి నిర్వహణలో ఒత్తిడికి గురి కాకుండా క్రీడలు, వ్యాయామం, యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ రమేష్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం నిరంతర ప్రక్రియ

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ) : పుస్తక పఠనం వయస్సుతో నిమిత్తం లేకుండా నిరంతరం సాగే ప్రకియ అని అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి జె.శ్రీనివాస్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారిన పరిస్థితులకు అనుగుణంగా పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ మారం గోనారెడ్డి, కార్యదర్శి బి.బాలమ్మ, గాదె వినోద్‌రెడ్డి, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్టా నాగయ్య, లైబ్రేరియన్లు శ్రవణ్‌కుమార్, నిర్మలాదేవి, జానిషా, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చకచకా.. సమగ్ర సర్వే!

- రాష్ట్రంలోనే రెండో స్థానంలో నల్లగొండ
- ఇప్పటికి 55 శాతం సర్వే పూర్తి



మర్రిగూడ మండలం రామిరెడ్డిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో వేగంగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలతో పోలిస్తే సర్వేలో నల్లగొండ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. 12 మండలాలతో ఉన్న చిన్న జిల్లా అయిన ములుగు మొదటి స్థానంలో ఉండగా రాష్ట్రంలోనే అత్యధిక మండలాలతో అతి పెద్దజిల్లాగా ఉన్న నల్లగొండ రెండో స్థానంలో నిలిచింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి సర్వేపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు మండల ప్రత్యేక అధికారులతో పాటు సూపర్‌వైజర్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దీంతో జిల్లాలో సర్వే వేగంగా ఇప్పటికే 55 శాతం పూర్తయింది.

జిల్లాలో 5,03,500 కుటుంబాలు..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఇళ్ల గుర్తింపు చేపట్టింది. ఎన్యుమరేటర్లంతా ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ పూర్తిచేశారు. 9వ తేదీ నుంచి సమగ్ర సర్వే ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 844 గ్రామ పంచాయతీలు, 8 మున్సిపాలిటీల పరిధిలో 182 వార్డులున్నాయి. వీటిలో మొత్తం 5,03,500 కుటుంబాలను గుర్తించారు. ఇందులో గురువారం నాటికి జిల్లాలో 2,80,249 గృహాల్లో ఎన్యుమరేటర్లు పూర్తి చేశారు.

3,832 మంది ఎన్యుమరేటర్ల ద్వారా..

జిల్లాలో సర్వే కోసం గ్రామ పంచాయతీలో 3,131, పట్టణాల్లో 839 బ్లాక్‌లుగా విభజించారు. 3,832 మంది ఎన్యుమరేటర్లను ఎంపిక చేశారు. ఒక్కొక్కరు 100 నుంచి 200 ఇళ్ల వరకు సర్వే చేయాల్సి ఉంది. ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 386 మందిని ఎంపిక చేయగా వారంతా నిత్యం గ్రామాల్లో తిరుగుతూ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్నం వరకు పాఠశాలలో బోధిస్తూ.. ఆ తర్వాతి నుంచి సర్వే చేస్తున్నారు. సెలవు దినాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వేలో నిమగ్నమవుతున్నారు. ఎన్యుమరేటర్లు సర్వే చేసిన రిపోర్టులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అందుకోసం జిల్లాలో 2,835 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు.

- గురునానక్ జయంతి



గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున నల్లగొండలోని ఆర్పీ రోడ్డు సిక్‌వాడి గురుద్వార్ సభలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సిక్కులు - రామగిరి(నల్లగొండ)

ప్రైవేట్ స్కూళ్ల మూసివేతే పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే.. ప్రభుత్వాలు ప్రైవేట్ పాఠశాలలను మూసివేయడమే పరిష్కారమని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో 'తెలంగాణ విద్యా రంగం సవాళ్లు' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ పెంచాలన్నారు. అందరికీ నాణ్యమైన ఉచిత విద్యను అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు ఆర్.విజయ్‌కుమార్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, పి.వెంకులు, కె.రత్నయ్య, పందుల సైదులు, సుధాకర్‌రెడ్డి, అద్దంకి దశరథ, కొంపల్లి భిక్షపతి, జానకిరాంరెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎడ్ల సైదులు, పర్వతాలు, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ

రాజాపేట: మండలంలోని జాల గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు మొగిలి వెంకటయ్య, గజం నరసింహులు శుక్రవారం తమ వ్యవసాయ బావిలో వద్దకు వెళ్లగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి ఉండగా.. అందులోని కాపర్ వైరు అపహరణకు గురైంది. ఈ మేరకు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రానికి చెందిన బండి కృష్ణ(19) ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని తల్లి ఎల్లమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

తిరుమలగిరిలో కారు బీభత్సం



ప్రమాదానికి గురైన కారు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలో శుక్రవారం కారు బీభత్సం సృష్టించింది. తిరుమలగిరి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తమ కారును మల్లీశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో ఉన్న యూటర్న్ వద్ద ఒక్కసారిగా తిప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టి అక్కడే నిలిచిపోయింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతిన్నది. కారులో ఉన్న ఇద్దరు యువకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అదుపుతప్పి దుకాణాలపైకి దూసుకెళ్లిన కారు



ప్రమాదంలో ధ్వంసమైన దుకాణాలు

చింతపల్లి: మండల కేంద్రంలో తెల్లవారు జామున కారు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి కారులో ఏడుగురు యువకులు చందంపేట మండలం వైజాగ్ కాలనీకి వస్తున్నారు. మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున చింతపల్లి మండల కేంద్రానికి రాగానే కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో ఒక్కసారిగా హైదరాబాద్ నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న మూడు దుకాణాల పైకి దూసుకెళ్లింది. దుకాణాల ముందు ఉన్న స్కూటీ తో పాటు దుకాణాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న యువకులకు ఎలాంటి గాయాలు కాలేదు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

• దేవరకొండ డీఎస్పీ గిరిబాబు

గుర్రంపోడు: మండలంలోని ఎర్రగూడెం గ్రామంతోపాటు నాంపల్లి, కొండమల్లేపల్లిలో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. శుక్రవారం గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన వడ్డే గోపాల్, వడ్డే రామాంజనేయులు ఈ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నెల 9న గుర్రంపోడు మండలంలోని ఎర్రగూడెం గ్రామంలో వంటెద్దు రాంరెడ్డి ఇంట్లో రూ.60వేల నగదు, అరతులం బంగారం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

గాలింపు చర్యలు చేపట్టగా.. నిందితులు శుక్రవారం దేవరకొండకు బస్సులో వెళ్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా ఆమలూరు స్టేజీ వద్ద ఇద్దరు వ్యక్తులు బస్సు దిగి పారిపోతుండగా పట్టుకుని విచారించారు. ఎర్రగూడెం చోరీతోపాటు కొండమల్లేపల్లి, నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు అంగీకరించారని తెలిపారు. నేరళ్లపల్లిలో పుస్తలతాడు, కొండమల్లేపల్లిలో రూ.50 వేల నగదు, బంగారు ఆభరణాలు అపహరించినట్లు చెప్పారు. వీరి నుంచి మూడున్నర లక్షల విలువ గల సొత్తు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ కేసును ఛేదించిన నాంపల్లి సీఐ ధనుంజయ, ఎస్‌ఐ మధు, సిబ్బంది హేమనాయక్, భాస్కర్, కావలి నర్సింహ, పి. సత్యనారాయణలను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

కేటీఆర్‌కు మతి భ్రమించింది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, పాల్గొన్న నాయకులు

• నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీస విలువలు మర్చిపోయి మాట్లాడుతున్నాడని, ఆయన వ్యవహారశైలి తెలంగాణ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను బద్నాం చేసే విధంగా ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించిన కేటీఆర్.. నేడు మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. ఐఏఎస్ అధికారులపై తన పార్టీ వారిచే దాడులకు పురమాయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే ఆలోచనలో ఉన్నాడని ఆరోపించారు. తర్వాత తనను అరెస్టు చేస్తారని కేటీఆర్ తనకు తానే పత్రికల్లో రాయించుకుంటున్నాడని విమర్శించారు. కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాలు గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. ఆ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అక్కడ భూముల రేట్లు పెంచి అభివృద్ధి చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ కూడా కక్ష సాధింపు చర్యలు లేకుండా పాలన సాగిస్తోందని చెప్పారు. విలేకరుల సమావేశంలో నాయకులు పూజర్ల శంభయ్య, చామల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

• ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : గీత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని 200మంది కల్లు గీత కార్మికులకు మంజూరైన సేఫ్టీ మోకులను శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గీత వృత్తి ఎంతో ప్రమాదకరమైనదని, కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం సేఫ్టీ మోకులు అందిస్తుందన్నారు. కల్లు గీసుకుంటూ జీవనం కొనసాగించే ప్రతికార్మికుడు తాటిచెట్టు ఎక్కేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల మూసివేతకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ జిల్లా అధికారి చాణక్య, బీసీ సంక్షేమశాఖ అధికారి సంజీవ, రామన్నపేట, నాంపల్లి, చండూరు ఎక్సైజ్ అధికారులు బాలాజీనాయక్, సైదులు, కుర్మనాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉండొద్దు

గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా అధికారులు చొరవ చూపాలని, అందుకు అవసరమైన నిధులు



గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయే గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి, అందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, అందుకు అవసరమయ్యే నిధులెంతా అని అడిగి తెలుసుకున్నారు. సమీక్ష సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పబ్బు రాజు, వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, పల్లె వెంకన్న తదితరులు ఉన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న విదేశీయులు



శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో విదేశీయులు

నార్కట్‌పల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని గోపలాయపల్లి సమీపంలో గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయాన్ని శుక్రవారం రష్యా దేశస్తులు సందర్శించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేశారు. ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి వారిని సన్మానించారు.

బస్సుల సంఖ్య పెంచాలి

నల్లగొండ రూరల్ : బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ ఆర్‌ఎం రాజశేఖర్‌కు ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమానికి ఫోన్ ద్వారా తమ సమస్యలను విన్నవించారు. మహాలక్ష్మి పథకంతో అన్ని బస్సుల్లో మహిళా ప్రయాణికులు ఎక్కువగా ఉండటం వల్ల సీట్లు దొరకడం లేదని బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. బస్టాండ్‌లో పరిశుభ్రత మెరుగు పరచాలని, గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపాలని, సూర్యాపేట, నల్లగొండ మధ్య బస్సులు పెంచాలని కోరారు. పది రూపాయల నాణేలను కండక్టర్లు తీసుకోవడం లేదని ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం చెల్లుబాటు అవుతాయని కండక్టర్లంతా నాణేలు తీసుకుంటారని తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

నూతనకల్: తన సొంత వ్యవసాయ పొలంలోకి ఉన్న దారి నుంచి వరికోత మిషన్ వెళ్లనివ్వకుండా కొంత మంది రైతులు అడ్డుకోవడంతో మనస్తాపానికి గురైన రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేశమల్ల వెంకన్న వ్యవసాయ భూమిలోకి వరికోత మిషన్ రాకుండా అడ్డుకుంటున్నారని మనస్తాపానికి గురై పురుగుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తమ కుటుంబాన్ని వేధిస్తున్న రైతులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

భువనగిరి క్రైం: భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు. హన్మాపురం సబ్ స్టేషన్‌కు వెళ్లే దారిలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఓటీ పోలీసులు, భువనగిరి రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,400 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలి

• ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

కోదాడరూరల్ : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలలో మాదిగలకు 12శాత రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతుంటే.. కాంగ్రెస్ పార్టీకి చెందిన గడ్డం వివేక్ అడ్డుపడుతున్నాడని అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల్లో గల 59 ఉపకులాల్లో మాదిగలే ఎక్కువ ఉన్నందున ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి ఏ కు 6శాతం, బీ 7, సీ 1, డీ 1శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా మాదిగలకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 శాతం రిజర్వేషన్ కోసం 119 నియోజకవర్గాల్లో పర్యటించి మాదిగలను చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండమీద గోవిందరావు, బెజవాడ శ్రవణ్, పిడమర్తి దశరథ, రాహుల్, వేణు, లాజర్, గోపి, రవి పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

మిర్యాలగూడ : మాదిగల జనాభా ప్రాతిపదికన



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాదిగల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణపై అనేక రూపాల్లో ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ ఫలితంగానే ఏబీసీడీ వర్గీకరణకు ఆమోదం లభించిందన్నారు. ప్రస్తుతం జనాభా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాలు యూనిట్ చేసినప్పుడే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 23న నల్లగొండలో ఏర్పాటు చేసే మాదిగల సమ్మేళనానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండకింది గోవిందరావు, కొమ్ము శ్రీనివాస్, ఉబ్బపల్లి కాశయ్య, వట్టె జానయ్య, దైద రవి, ఊర రామకృష్ణ, శ్రవణ్, రాజశేఖర్, మట్టయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడి సన్నిధిలో కార్తీక దీపారాధన



ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఈఓ భాస్కర్‌రావు



ప్రధానాలయ ధ్వజస్తంభంపై ఆకాశ దీపం

యాదగిరిగుట్ట: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం యాదగిరీశుడి సన్నిధిలో, కొండపైన విష్ణు పుష్కరిణి, శివాలయంలో సామూహిక కార్తీక దీపారాధన నిర్వహించారు. శివాలయంలోని ధ్వజ స్తంభం ఎదుట మహిళలు దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇక.. సాయంత్రం శ్రీస్వామి వారి ప్రధానాలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపోత్సవం చేపట్టారు. ఆగమ శాస్త్రానుసారం ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపానికి పూజలు చేసి, ధ్వజ స్తంభం పైకి ప్రత్యేక దీపాన్ని పంపించారు. ఆయా పూజల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

• తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని



మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల శాఖలకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగమణి, బక్కా శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శులు మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, ఆడోతు చిన వెంకన్న, దయాకర్ రెడ్డి, విజయలక్ష్మి, చంద్రశేఖర్ వ్యవహరించారు. జరిగాయి. మిర్యాలగూడ పట్టణ శాఖ అధ్యక్షుడిగా కోడిరెక్క జయరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.సాజిత్ అలీ, రూరల్ శాఖ అధ్యక్షుడిగా ఉస్మాన్, ప్రధాన కార్యదర్శిగా పులి సత్యనారాయణ, దామరచర్ల మండల శాఖ అధ్యక్షుడిగా బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.శ్యామ్‌కుమార్ ఎన్నికయ్యారు.

'నా పంట యాప్'పై రైతులకు అవగాహన

గరిడేపల్లి: గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ×నా పంట యాప్×ను వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థులు మాట్లాడుతూ.. మార్కెట్, వాతావరణం, కీటకాలు, తెగుళ్లు, కలుపు, పోషక లోపాల వంటి సమాచారం యాప్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ఘంట సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి బాచు సైదయ్య, విద్యార్థినులు అనిత, అమిషా, వర్షిత, అశ్విని, ఎస్. దీక్షిత, దివ్య, లావణ్య, నేహ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో అగ్రికల్చర్ విద్యార్థులు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



చిర్రగూడూరు స్టేజి వద్ద అంజయ్య మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల పరిధిలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన కమ్మంపాటి అంజయ్య (57) గురువారం రాత్రి వలిగొండ – తొర్రూర్ ప్రధాన రహదారిపై టీవీఎస్ మోటారుసైకిల్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చిర్రగూడూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదని, ఈ కారణంగానే రోడ్డు రోలర్‌ను ఢీకొని అంజయ్య మృతిచెందాడని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తూ చిర్రగూడూరు స్టేజి వద్ద మృతదేహంతో శుక్రవారం ధర్నా నిర్వహించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వారు వినిపించుకోకపోవడంతో పోలీసులకు, మృతుడి బంధువుల మధ్య వాగ్వాదం నెలకొంది. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు అక్కడి చేరుకున్నారు. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రాజాపేట: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేటకు చెందిన మేకల వెంకటేష్ (30)కు బసంతపురం గ్రామానికి చెందిన పవిత్రతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేష్ జీవనోపాధి కోసం కారు నడుపుతూ హైదరాబాద్‌లోని వారాసిగూడలో ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా వెంకటేష్ రాజాపేటకు వచ్చాడు. దీంతో అత్త, బావలు వచ్చి వెంకటేష్‌కు సర్ది చెప్పి అతడి భార్యా పిల్లలను తీసుకొని హైదరాబాద్‌కు వెళ్లారు. భార్యా పిల్లలపై బెంగతో వెంకటేష్ మద్యానికి అలవాటు పడ్డాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి పడుకున్నాడు. తెల్లవారి లేచి చూసేసరికి వెంకటేష్ కనిపించలేదు. ఆచూకీ కోసం తండ్రి సత్తయ్య తమ బంధువుల ఇళ్లల్లో వెతికినా కనిపించలేదు. శుక్రవారం ఉదయం రాజాపేట శివా రులోని దాచెపల్లి రాజు వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో రైతు ఎర్ర గోకుల నర్సింహ గ్రామస్తులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు మేకల వెంకటేష్‌గా గుర్తించారు. తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

నడిగూడెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి కోతల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వైపు రైతులు రబీ సీజన్ సాగుకు కూడా సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కోసిన వరి కొయ్యలకు రైతులు నిప్పంటిస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో పంటకు ఉపయోగమయ్యే క్రిమికీటకాలు చనిపోతాయని, పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ తెలిపారు. వరి మొదళ్లను కాల్చడం ద్వారా కలిగే నష్టాలు ఆయన మాటల్లోనే..

లాభాలు తెలియక వరి మొదళ్లు కాలుస్తున్న రైతులు

నేడు ఆధునిక యంత్రాలు అందుబాటులో రావడంతో వరి పంటను 15–30 సెం.మీ. పైకి మాత్రమే కోయడంతో వరి మొదళ్లు పెద్దవిగా ఉంటున్నాయి. ఒకప్పుడు మనుషులు కోసినప్పుడు పశుగ్రాసం కూడా అధికంగా లభించేది. నేడు ఆధునిక యంత్రాలతో వరి కోయడం



నడిగూడెం వద్ద కాల్చివేసిన వరి కొయ్యలు

వల్ల పశుగ్రాసం దొరకని పరిస్థితి నెలకొన్నది. వరికొయ్యలను కాల్చడంతో భూమిలోని సారంతోపాటు, మేలు చేసే క్రిములు చనిపోయి పంట దిగుబడి తగ్గుతుంది. దిగుబడి కోసం రైతులు ఇతర క్రిమిసంహారక మందులు వాడడంతో పెట్టుబడి కూడా పెరుగుతుంది. కొయ్యలను కాల్చకుండా అలాగే దున్నడం వల్ల సూక్ష్మపోషకాలు పెరుగుతాయి. భూసారానికి ఎంతో మేలు కలుగుతుంది.

పాడిపంట

వరి కొయ్యలకు నిప్పు పెడితే కలిగే నష్టాలు

- వరి మొదళ్లను కాల్చడం వల్ల మంటలు ఎగబడి వేడి తీవ్రతకు సూక్ష్మజీవులు చనిపోతాయి.
- ఆశించిన మేర వరి పంట దిగుబడి రాదు.
- వరి మొదళ్లలో నత్రజని, భాస్వరం, పొటాషియంతోపాటు సూక్ష్మజీవులు ఉంటాయి. మొదళ్లను కాల్చడం వల్ల ఈ పోషకాలు నేలలో కలవకుండా మంటకు మాడిపోతాయి.
- తరచుగా గడ్డి కాల్చే పొలాల్లో నేల కోతకు గురవుతుంది. తద్వారా నేలపైన ఉండే సారవంతమైన పొర కొట్టుకుపోతుంది.
- పొలంపై గడ్డి తగలపెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతుంది. గ్లోబల్ వార్మింగ్ ఏర్పడి వాతావరణం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం లేకపోలేదు.

వరి మొదళ్లను కలియదున్నడం వల్ల కలిగే లాభాలు

- భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- నేలకు సేంద్రియ పదార్థం అందుతుంది.
- యూరియా, డీఏపీ, పొటాష్ వేయడం వల్ల ఎంత ప్రయోజనం చేకూరుతుందో నేలకు అంత సేంద్రియ పదార్థం అందుతుంది.
- నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూమికి నీటిని, పోషకాలను నిల్వ ఉంచే గుణం పెంచుతుంది.
- వాయు కాలుష్యం జరగకుండా ఉంటుంది.
- వరిగడ్డి మొదళ్లు పశువులకు మేతగా ఉపయోగపడుతుంది.
- వరి కొయ్యలు కుళ్లడంతో పంటకు ఎరువుగా ఉపయోగపడి దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.
- గడ్డి తిని బతికే కీటకాలు, పశువులకు ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రవితేజ



నకిరేకల్ : పట్టణానికి చెందిన నకిరేకంటి రవితేజ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవితేజ మాట్లాడారు. భారత రాజ్యాంగ రక్షకురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన బొడ్డు కిరణ్, కత్తుల కాన్షీరాం, వాసు, రాజు, మర్రి శోభ విజయ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా చింతపల్లి బయ్యన్న



నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన చింతపల్లి బయ్యన్న సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన పార్టీ మండల మహాసభలో తనను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు శుక్రవారం ఆయన విలేకరులకు తెలి పారు. తాను 15ఏళ్లుగా ఎస్ఎఫ్ఐ, సీఐ టీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా చేసిన అనుభవంతో పార్టీ మండల కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని మదర్ థెరిస్సా హోంలో లయన్స్ శక్తి న్యూ వాయిసెస్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ ఝాన్సీరాణి సోదరి ఎలిజిబెత్ చౌదరి భర్త మారనేని డామినిక్ సామియో చౌదరి స్మారకార్థం శుక్రవారం దుస్తులు, ప్లేట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిషప్ సమర్పణ్‌కుమార్, లయన్ సతీష్ కోడె, లయన్ మాధవి, ఇందిర, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

శాంతి సాధనలో సైన్స్ పాత్ర కీలకం



సదస్సులో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

నకిరేకల్ : శాంతియుత ప్రపంచాన్ని సాధించడంలో సైన్స్ పాత్ర గొప్పదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్ రెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో జరిగిన డివిజన్ స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతి సాధనకు సైన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సదస్సులో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గంగాధరి భద్రయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వంటిపాక నగేష్, కోకిల, శ్రీనివాస్, సుధాకర్, విజయలక్ష్మి, అశోక్, సుధీర్‌రెడ్డి, రవీందర్, సురేందర్, స్వామి తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



మహిళలను సన్మానిస్తున్న సంతోష్‌యాదవ్

మర్రిగూడ : మహిళలు అన్ని రంగాలలో రాణించి ముందుండాలని యువజన నాయకుడు, సామాజిక కార్యకర్తల వల్లంల సంతోష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో మహిళలు కోలాటం శిక్షణ పొందేందుకుగాను రూ.41వేలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కోలాటం ఆటలు, పాటలు ఆకట్టుకుంటాయన్నారు. గ్రామానికి చెందిన మహిళలు కోలాటం నేర్చుకోవడం ఆనందంగా ఉందని, మహిళలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సంతోష్‌యాదవ్‌ను మహిళలు శాలువాలతో సన్మానించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకండ కాంతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి బొలుగూర్ నరసింహ, వేముల బుచ్చయ్య, సీహెచ్ ఊశయ్య, యాదయ్య, రామకోటి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నల్లగొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు శివుడికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. రాత్రి పలు ఆలయాల్లో జ్వాలా తోరణం కార్యక్రమం అర్చకులు ఘనంగా నిర్వహించారు.

\- సాక్షి నెట్‌వర్క్



నల్లగొండ : ఛాయా సోమేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నల్లగొండ : పచ్చల సోమేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో పూజలు చేస్తున్న జిల్లా జడ్జీలు శిరీష, సౌందర్య తదితరులు



నకిరేకల్‌లోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నకిరేకల్ : శివాలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు



నల్లగొండ : రామగిరిలోని ముత్యాలమ్మ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో శివలింగాకారంలో కార్తీకదీపాలు



నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకులు



నల్లగొండ : ఛాయా సోమేశ్వర ఆలయంలో బారులుదీరిన భక్తులు



నల్లగొండ : ఛాయా సోమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నల్లగొండ : పచ్చల సోమేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



నల్లగొండ : ఛాయా సోమేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ దంపతులు



నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు



నల్లగొండ : ఛాయా సోమేశ్వరాలయంలో దర్శనానికి బారులు



నకిరేకల్‌లో శివాలయంలో జ్వాలా తోరణం



కేతేపల్లి : గుడివాడ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిట్యాల : ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు



కట్టంగూర్ : శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శాలిగౌరారం : వల్లాల పార్వతీ శంభులింగేశ్వర దేవాలయంలో ధ్వజస్తంభానికి భక్తుల పూజలు

23న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : నల్లగొండలో ఈనెల 23న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు, సంఘం నియోజకవర్గ కన్వీనర్ ముడుసు భిక్షపతి తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నల్లగొండలో నిర్వహించబోయే ఈ ఆత్మీయ సమ్మేళనానికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి హాజరవుతున్నారని తెలిపారు. మాల బాంధవులు సకాలంలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ నామ చక్రవర్తి, నాయకులు యనమల్ల అనిల్, బొగరి అనిల్, రోయ్య కిరణ్, బొప్పని సుబోధయ్, అన్నిమల్ల లింగస్వామి, ప్రసాద్, అశోక్, పృథ్వీ, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న లింగస్వామి

చిట్యాల : పట్టణంలో పలు విద్యా సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే వేముల వీరేశంకు పట్టణానికి చెందిన తెలంగాణ గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదె లింగస్వామి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలో సాంఘీక సంక్షేమ శాఖ గురుకులాన్ని, కేజీబీవీ పాఠశాలను, మోడల్‌స్కూల్‌ను, ప్రభుత్వం ఇంటర్, డిగ్రీ కాలేజీలను, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ భవనాన్ని, అధునాతన లైబ్రేరీని మంజూరు చేయాలని కోరుతూ ఆయన ఎమ్మెల్యేకు విన్నవించినట్లు తెలిపారు.

నిరుపేదకు చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

నకిరేకల్ : పట్టణంలోని మార్కెట్‌రోడ్డులో నివాసం ఉంటున్న నిరుపేద కొండ శేఖర్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక లిటిల్‌సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొలను రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రాజేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మంత్రి కోమటిరెడ్డి మేనల్లుడు కొలను రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి కేక్ కట్ చేసి రాజేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎం వీ.గోనారెడ్డి, కత్తుల కోటి, వంగాల అనిల్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, గోలి నురేందర్‌రెడ్డి, అల్లి సుభాష్‌యాదవ్, జయకుమార్, నాగరాజు, కార్తీక్, జహంగీర్, ఆనంద్‌రెడ్డి, గిరి, గోపాల్, రంజిత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధర్నాను విజయవంతం చేయాలి

శాలిగౌరారం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయాలని సీఆర్‌పీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగూరి కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నామన్నారు. ధర్నాకు జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

త్వరలో బూత్ కమిటీల నియామకం

నార్కట్‌పల్లి : ప్రతి గ్రామంలో త్వరలో బీజేపీ బూత్ కమిటీలను నియమించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగిలయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్, మండల సభ్యత్వ ప్రముఖ్ మెడబోయిన శ్రీనివాస్, మునుకుంట్ల గణేష్, రమేష్, మధుకర్‌రెడ్డి, నడింపల్లి శ్రవణ్, సత్తయ్య, రామలింగయ్య, శివ, చంద్రశేఖర్, తిరుమలేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 08:30గంటల నుంచి 12:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశంబజార్, మిర్యాలగూడ రోడ్డు, ఎస్ఆర్ గార్డెన్స్, మాన్యంచెల్క, ఆర్టీసీకాలనీ, బస్టాండ్, శ్రీనివాసకాలనీ, గొల్లగూడ, పెద్దబండ, కలెక్టరేట్, ఫారెస్ట్ కార్యాలయ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హామీలను అమలుచేయాలి

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని 21వవార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120గజాల స్థలాన్ని కేటాయించాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు మహమ్మద్ ఇక్బాల్‌సాజిద్, సలిఓజు సైదాచారి, అన్నభీమోజు పద్మ, శివ, సుజాత, ఆడిపోజు నర్సింహచారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : మిర్యాలగూడలో డిసెంబర్ 2న జరిగే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో కట్ట అంజయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కొండా అనురాధ, మండల కమిటీ సభ్యులు పోతె సత్యనారాయణ, వెంకన్న, సైదులు, అంజయ్య, రవీందర్, ఎలయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● డీసీఓ పాత్యానాయక్



తిప్పర్తి : కొనుగోలు కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీఓ



నల్లగొండ రూరల్ : ఖాజీరామారం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

తిప్పర్తి : కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీసీఓ (జిల్లా సహకార అధికారి) పాత్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సన్నధాన్యం లారీ లోడ్‌కు సరిపడా రావడం లేదని తెలపడంతో వచ్చిన ధాన్యాన్ని ట్రాక్టర్లతో తరలించాలన్నారు. రైతులు కేంద్రాల నిర్వాహకులకు సహకరించి ధాన్యం అమ్ముకోవాలన్నారు. ధాన్యం అమ్మిన వెంటనే రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట సీఈఓ భిక్షమయ్య, అవినాష్‌రెడ్డి ఉన్నారు.

నల్లగొండ రూరల్ : రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అర్జాలబావి, ఖాజీరామారం, చర్లపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఎగుమతి చేయాలన్నారు. అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లారీల సమస్య ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం వినోద, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని, అధికారులు కొన్ని నిబంధనలు సడలించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండా శ్రీశైలం కోరారు. శుక్రవారం మండలంలోని సింగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం సిబ్బంది తేమ శాతం పేరుతో రైతులను రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు కాయిస్తున్నారని అన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారని అన్నారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్‌కుమార్, వేముల లింగస్వామి, యసరాని శ్రీను, యాట యాదయ్య ఉన్నారు.

18నుంచి కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న కొత్త వెంకన్న

చిట్యాల : దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18నుంచి 23వ తేదీ వరకు నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రిలే నిరాహార దీక్షల అనంతరం ఈనెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.6వేలు చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు దాటుతున్నా ఇప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో సంఘం మండల నాయకులు సామ రవీందర్‌రెడ్డి, వేలుపల్లి మధు, తొట్ల లింగస్వామి, అంతటి శ్రీను, కొత్త సుధాకర్, పాకాల సత్యనారాయణ, నర్సింహ, అశోక్, నగేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పూర్వవైభవం తేవాలి

నకిరేకల్ : గ్రామగ్రామాన టీడీపీ సభ్యత్వం ముమ్మరం చేసి తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం వచ్చేలా కృషి చేయాలని టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేను పార్టీకి చేసిన సేవతో నేడు ఈపదవి లభించిందన్నారు. అనంతరం భువనగిరి పార్లమెంట్ కమిటీ కన్వీనర్ కుందారపు కృష్ణాచారి మాట్లాడారు. రూ.100 సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా రూ.5లక్షల ఉన్నందున ప్రతిఒక్కరూ చేరాలని కోరారు. అనంతరం నర్సిరెడ్డిని పలువురు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, నర్సింహ, శ్రీధర్‌రెడ్డి, రాంభనేష్, యాదయ్య, రాములు, క్రిష్టారెడ్డి, సైదులు, సతీష్ పాల్గొన్నారు.

గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపిక

కేతేపల్లి : మండల కేంద్రానికి చెందిన జటంగి కోటయ్య-నాగమ్మ దంపతుల కుమారుడు నాగరాజు గ్రూప్-4 ఫలితాలలో ప్రతిభ కనబరిచి సూర్యాపేట జిల్లాలో బీసీ వెల్ఫేర్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

కట్టంగూర్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ గురువారం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో మండలంలోని అయిటిపాముల జీపీ పరిధి శ్రీకృష్ణనగర్‌కు చెందిన రైతు ముత్యాల యాదయ్య-నర్సమ్మ దంపతుల కుమారులు ముత్యాల మహేష్, ముత్యాల శివాజీ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. శివాజీ ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా, మహేష్ నిర్మల్ కమిషనర్ ఆఫ్ లేబర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, ఓ యువతి గురువారం విడుదలైన గ్రూపు-4 పరీక్షల్లో జూనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగాలు సాధించారు. సుర్కంటి జైపాల్‌రెడ్డి రెవెన్యూ విభాగంలో సీసీఎల్ఏలో జూనియర్ అసిస్టెంట్, గోలి సాయితేజ రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్, వట్టిపల్లి అలేఖ్య జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు.